

ద్విభాష్యం రాజేశ్వరరావు ఉ శివల జగన్నాథరావు

"రేపు సాయంత్రం 312 నెం. రూమ్ లోని పేషంటును డిశ్చార్జి చేశేస్తాం! ఎల్లుండి ఉదయం వస్తే మీకు ఆ రూము ఇస్తాను అంది డాక్టరు, కళ్ళద్దాలు తీసి రుమాలుతో తుడుచుకుంటూ !

'థేంక్యూ డాక్టర్ ! ఎల్లుండి ఉదయం వస్తాను। ఈ ఎడ్వాన్సు ఉంచండి!' అంటూ యాభై రూపాయలు తీసి టేబిలు మీద ఉంచాను.

డాక్టర్ టేబిలు మీదున్న బుక్ తీసి నా పేరు, చిరునామా నోట్ చేసుకుని ఇక వెళ్ళవచ్చునన్నట్లు చూసింది.

ఆవిడకు నమస్కరించి బయటకు వచ్చాను! ఎర్రటి ఎండలో అమెరికన్

హాస్పిటల్ గోడలు తళతళలాడుతున్నాయి! మధ్య ఆవరణలో వుంచిన మేరీమాత తెల్లని పాలరాతి విగ్రహం ఎండలో మెరుస్తోంది! విగ్రహం వెనుకనున్న అరటి ఆకులు ఆర్చిలా వంగి విలాసంగా కదులుతున్నాయి.

మెట్లు దిగి కారిడార్‌లోకి వచ్చి టాక్సీలో కూర్చున్నాను. 'అలంకార్ లాడ్జికి పోనియ్!' అన్నాను.

డ్రైవరు మౌనంగా స్టార్ట్ చేసాడు! టాక్సీ మెల్లిగా కదిలి కృష్ణనగర్ రోడ్డు వైపు వెళ్తోంది!

ఆరునెలల క్రితం నుండి—నాకు ఊపిరితిత్తుల్లో అప్పుడప్పుడు నెప్పివస్తోంది మొదట్లో వారానికో మాటు వచ్చేది. తరువాత రోజులో ఏదో టైములో ఒక్కసారైనా రావటం మామూలయిపోయింది. నొప్పి ముదిరేలోగా నాన్నగారు గృహ వైద్యం చేసేరు. కషాయాలు, కాపడాలు పెట్టారు! ఏమాత్రం గుణం కన్పించలేదు! నాకు నొప్పి వచ్చినప్పుడల్లా అమ్మ బెంగ బెట్టుకొని తల్లడిల్లిపోయేది. పుట్టిన నలుగురిలోనూ మిగిలింది నేనొక్కణ్ణే! మిగిలిన వాళ్లందరూ ఏదో బాలారిష్టాలతోనే పోయేరట!

ఇక నాన్న సంగతి చెప్పనక్కర లేదు!

మాటిమాటికీ నొప్పివస్తూంటే ఒక్కోసారి చచ్చిపోతే బాగుండు ననిపించేది!

ఈ ఆరు నెలల్లోనూ మూడు నెలల పైగానే ఆఫీసుకి శలవు పెట్టేను. ఎంత మేనేజరునయినా పదేపదే శలవు పెట్టడం ఏం బాగుంటుంది? ఈ అనారోగ్యంవలన క్రింది ఉద్యోగస్తుల దృష్టిలోకూడా కొంత చులకన అయిపోయాను! ఆఫీసు మేనేజరు అంటే బాధ్యతతో కూడిన ఉద్యోగం. బాధ్యతని సక్రమంగా నిర్వర్తించక పోతే పదవిలో వుండి ప్రయోజనం లేదన్నది నా పాలసీ.

నొప్పివచ్చినపుడు ఏదో మందు వెయ్యటం, తాత్కాలికంగా తగ్గి మళ్ళీ రావటం! ఇలా వూరుకుంటే లాభంలేదు. ఒకసారి విశాఖపట్నం వెళ్ళి మాధవరావు గార్కి చూపించుకుని రాకూడదూ! అన్నారు నాన్న!

ఆయన పోరు పడలేక విశాఖపట్నం వచ్చేను! నాన్నకూడా నాతో బయల్దేర బోయేరు గాని నేనే వద్దన్నాను. ఆయనది పెద్ద వయస్సు, అదీగాక 'డయాబిటీసు, బ్లెడ్‌ప్రెషరు, ఆయాసం వస్తే మనిషి కారు! అమ్మ ఎట్లాగూ ఆయన్ని కని పెట్టుకుని వుండకపోతే జరగదు!

అమ్మ నేను బయలుదేరి వస్తుంటే కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఇరవై నాలుగేళ్లు వచ్చినా అమ్మ కంటికి నేను ఇంకా పసిపాపలాగే కనిపిస్తాను కాబోలు!

ఏమిటో ఈ జీవితాలు!

లేనివాడికి లేని బాధ, ఉన్నవాడికి మరో బాధ! లంకంత ఇల్లు, బోలెడంత ఆస్తి, ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు. లేనిదల్లా

ఒక్కచే. ఆరోగ్యం !

డాక్టర్ మాధవరావుగారు నాన్నగార్కి స్నేహితులు. విశాఖపట్నంలో ప్రాక్టీసు చేస్తూ బాగా పేరూ, డబ్బూ గడించేరు! ఆయన్ని కలిస్తే నన్ను పరీక్షచేసి అమెరికన్ హాస్పిటల్లో జాయిన్ అయిపొమ్మన్నారు! రోజూ తనే అక్కడికి వచ్చి చూస్తానన్నారు! ఈ జబ్బుకి విశ్రాంతి చాలా అవసరమని చెప్పేరు!

ఇరవై దినాలకు సరిపడిన బట్టలు పంపించమని, నా ఆరోగ్యం గురించి బెంగపెట్టుకోవద్దనీ నాన్నగార్కి ఉత్తరం వ్రాసి పడేసాను. బ్రేక్ పడిన కుదుపుతో ఆలోచనలనుండి విడివడ్డాను. లాడ్జి అలంకార్ ముందు టాక్సీ ఆగి ఉంది! టాక్సీకి బిల్లు చెల్లించి అలంకార్‌లో ఒక రూమ్ తీసుకున్నాను, ఈ రెండు దినాలు గడపటానికి!

* *

"ఇదిగో, ఇదే మీ గది! మీకు ఏం కావాలన్నా నన్ను పిలవండి! ఈ వరండా చివర గదిలో నేను వుంటాను!" అంది నర్స్.

"థేంక్స్!" అంటూ గదిలోకి వెళ్లాను.

డబ్బుకి సంబంధించిన హాస్పిటల్ కనుక గదికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి! మధ్యలో స్ప్రింగ్‌కాట్, ఫోమ్ పరుపు, పైన సీలింగ్‌ఫేను, బట్టలస్టాండ్ అన్ని హంగులతో గది బాగానేవుంది. గదిని అనుకుని మరో చిన్నగది, దానిప్రక్కనే ఎటాచడ్ లావెట్రీ, బాత్‌రూమ్! గదికి అవలివైపు తలుపు తెరిస్తే చిన్న బాల్కనీ! బాల్కనీలో నిలబడితే ఉరకలు వేస్తున్న సముద్రం ఎదురుగా కనిపిస్తూంది! దిక్చక్రం దగ్గర నలుసుల్లా రెండు ఓడలు! కుడిప్రక్కగా లైట్‌హౌస్‌కొండ! సముద్రపు ఒడ్డున ఎత్తులో యూనివర్శిటీ లేడీస్‌హాస్టలు! ఇంకేవో రెండు పచ్చని భవంతులు! అక్కడ నిలబడి చూస్తుంటే ఆ దృశ్యం ఎంతో మనోహరంగా అనిపించింది! చల్లని ఆ వాతావరణానికి సగం రోగం తగ్గినట్లనిపించింది!

బ్యాగులోని ఫ్లాస్కు, రెండు జతల బట్టలు తీసి అలమారులో సర్దాను! మాగజైన్లు తీసి టేబిలుమీద పడేశాను! తలుపు దగ్గరగావేసి, మంచంమీద వాలి సిగరెట్టు తీసి ముట్టించాను!

తలుపు తెరుచుకుని నీళ్ళ కూజాతో వచ్చిన నర్స్ నావంక ఆశ్చర్యంగా చూస్తూ తలుపు దగ్గరే ఆగిపోయింది!

"ఈ హాస్పిటల్లో ఎవరూ సిగరెట్టు కాల్చకూడదు! ఈ సంగతి మీకు తెలీదా! ముందు ఆ సిగరెట్టు అవతల పారెయ్యండి! డాక్టర్ చూస్తే నా ఉద్యోగం ఊడుతుంది" అంది మందలింపుగా.

"సారీ!" అంటూ సిగరెట్టు నలిపి అవతల పడేశాను.

నీళ్లకూజా గదిలోపెట్టి "రెస్ట్ తీసుకోండి" అంటూ నర్స్ వెళ్ళిపోయింది.

హతోస్మి! అసలే కాలం గడవక పిచ్చెత్తినట్లుంది! సిగరెట్లుకూడా లేక పోతే నేను బ్రతకలేను!

టేబిలుమీద మాగజైను చేతిలోకి తీసుకున్నాను.

మధ్యాహ్నం వరకు అదిచూస్తూ గడిపాను. మధ్యాహ్నం నర్స్ భోజనం తీసుకువచ్చింది. ఈ లోగా రెండుమూడు సార్లు వచ్చి కుశల ప్రశ్నలు వేసి ధైర్యం చెప్పి వెళ్ళింది.

అసలు చిన్నతనంనుండీ నాకు హాస్పిటల్ అంటే ఒక విధమైన భయంవుంది! మృత్యువుకి చేరువవుతున్నవాళ్ళే హాస్పిటల్‌లో చేరుతారని, ఒక అపప్రథ నా మనసులో తిరుగాడుతూ ఉండేది. ఆ భయాలూ, నమ్మకాలూ చిన్నతనం నుండీ నాలో కదలాడుతూ ఉండడం వలన జబ్బు ప్రవేశించగానే నేను భయంతో పిడచ కట్టుకు పోయేను. హాస్పిటల్‌కి సాధ్యమయినంత దూరంగా ఉండి నా జబ్బు నయం చేసుకుందామనుకున్నాను. కాని— నా కోరిక నెరవేరలేదు! నేనిక్కడ—— ఇన్‌పేషెంటుగా చేరక తప్పలేదు—కాని! ఇక్కడ వాతావరణం, ట్రీట్‌మెంటు, నర్సింగూ, నాలోని భయాన్నీ, సంకోచాలనూ కొంతవరకు పారద్రోలాయి.

భోజనం ముగించి మంచంమీద కూర్చున్నాను.

తలుపు టకటకమని మెల్లిగా ఎవరో తట్టారు! నేను లేచి తలుపు తీసేందుకు వేళ్ళేలోపున తలుపుసందునుండి రెండు కవర్లు లోపల పడ్డాయి. ఆత్రంగా అవి తీసాను! రెండింటి మీద చిరునామా నాది కాదు! వి. భారతీదేవి అని వుంది! కొంచెం ఇంచుమించుగా రెండింటి మీద చిరునామాలు ఒకేలా వున్నాయి. రెండు కవర్లమీద ఫ్రమ్ ఎడ్రసులులేవు, కాని స్పష్టంగా అవి రెండూ, 312 రూమ్‌కు వచ్చినవే!

బహుశా ఈ భారతీదేవి ఇంతకు ముందు ఈ రూమ్‌లో ఉండే ఆవిడ కాబోలు!

నా ఆలోచనలకు స్వస్తిచెప్పి తలుపు తీసాను! పోస్ట్‌మెన్ అప్పుడే మేడ దిగి పోయినట్టున్నాడు. వరండామీద ఎవ్వరూ కనిపించలేదు! తిరిగి రూమ్‌లోకి వచ్చి తలుపు గడియపెట్టి మంచంమీద కూల బడ్డాను.

చేతిలో రెండు ఉత్తరాలూ కదులాడుతున్నాయి. వాటిలో ఏముందో?

పనిలేకుండా కూర్చున్న నాకు కోతికి కొబ్బరికాయ దొరికినట్లు ఈ ఉత్తరాలు దొరికేయి.

మనిషి మనసు కోతిబుద్ధికి ఏమాత్రం తీసిపోదనుకుంటా. పరాయివాళ్ళ ఉత్తరాలు చదవటం తప్పని తెలియనంత అసభ్యతకు, సంస్కారం నాలో లేవు! కాని ఈ సమయంలో ఆ ఉత్తరాల విషయం తేలుసుకోవాలన్న కౌతుకం, వుత్సుకత నన్ను అవి తెరిచేదాకా నిలవ




వియ్యలేదు!

ఒక కవరు విప్పాను. ముత్యాల కోవ లాటి దస్తూరీ! తెల్లని బాండ్ పేపరుమీద నల్లని అక్షరాలు మిలమిల్లాడుతున్నాయి.

''భారతీ!

ఈ సంబోధన చూచి, ''ఇంత చనువుగా రాసేది ఎవరా?' అని ఆశ్చర్యపోతున్నావు కదూ? నేను, భారతీ! కృష్ణని! నీ కృష్ణని! నీ హృదయకవాటాల్ని తెరిచి, ఒక్కమారు జ్ఞాపకాల పీదల్ని తడుముకో! మన వూరు—బాల్యంలో మనం కలిసి తిరిగిన ప్రదేశాలు—చెరువు ఒడ్డున ఆడిన ఆటలు—ఈశ్వరునిగుడి మంటపంలో కబుర్లు—ఆకాశంలో, అందాల చందమామ పొందుగోరి నువ్వు వెల్లడిచేసే ధర్మసందేహాలు—నా పరిజ్ఞానాన్ని వుపయోగించి చెప్పే జవాబులు—తిరునాళ్ళలో వేడుకలు—బాల్యం! అదో తియ్యని అనుభవం! ఆ తరువాత....వయసు మనిద్దరిపైన వేసిన కొత్త ముసుగులు! వలపువలలు! వాటిని తొలగించీ, తొలగించలేని అశక్తతలు—కొన్ని బంధాలు—విడదీయలేని అనుబంధాలు! .... నీకు గుర్తున్నదా? ఆ రోజు—మబ్బుపట్టి ఆకాశం మసకబారినవేళ—మీ చిన్న తమ్ముడిని తీసుకుని, పువ్వులు పట్టుకుని నువ్వు గుడికి వస్తున్నట్లు తెలిసి, నేను అక్కడ నీకోసం వేచివున్నాను. ఆవేళ—ఆకాశ నీలం పట్టుచీరెలో, ప్రకృతి అందాలన్నీ

కంటబోసుకుని ఈ రూపు ధరించివచ్చిందా? అన్నట్టున్న నిన్ను చూచి— 'ఈ అసమాన సౌందర్యం ఎవరి స్వంతమౌతుందో?'' అని భయపడుతున్నానని నేను అన్నాను. నువ్వు—''భయం దేనికి? ఈ సౌందర్యం నా స్వామి సొత్తే'' అన్నావు. ''ఎవరా స్వామి ' అని నేను అడిగితే, ''నేను చెప్పను బాబూ' అని సిగ్గుల దొంతరలో మునుచుకుపోతూ పలికావు !

''భారతీ ! నీమాట — నీ వాగ్దానం ఏమయింది? నేను పై చదువుల నిమిత్తం అమెరికా వెళ్ళి, వచ్చేసరికి, నీకు వివాహం అయిపోయిందని తెలిసింది. అమెరికా వెళ్ళేముందు కూడ—నన్ను తప్ప మరొక పురుషుణ్ణి నీ జీవితంలోకి ఆహ్వానించనని చేసిన ప్రమాణం ఏమైంది?— ఈ వార్త తెలిసి హతాశుణ్ణి అయ్యాను.

ఆలోచనల్తో మెదడు బద్దలవుతూంటే, తిండికీ, నిద్రకూ దూరమై పరితాపంతో ఒకవంక, నీమీద ఆగ్రహంతో ఒకవంక, దహించుకుపోతూ రెండు దినాలు గడిపాను....భారతీ! కాని, ఇప్పుడు.... ఇప్పుడు నాకు నీమీద ఆగ్రహం లేదు. భారతీ, కేవలం నిన్ను చూడాలన్న ఆకాంక్ష తప్ప! ఒక్కమారు నీ విగ్రహాన్ని దర్శించుకుని వెళ్ళిపోతాను. ఆఖరుసారిగా చూసిన నీ ఆకారాన్ని నా హృదయంలో ప్రతిష్టించుకుని, శేషజీవితాన్ని తృప్తితో వెంపుకోటానికి ప్రయత్నిస్తాను. ఈ మధ్య నీ శరీరంలో అస్వస్థత ఏర్పడిందని, విశాఖపట్నంలో హాస్పటల్లో వున్నావని వివరాలు తెలుసుకున్నాను. అడ్రసు కనుక్కుని వుత్తరం రాస్తున్నాను. వస్తున్నాను, భారతీ ! రేపే వస్తున్నాను. నీ భర్త హాస్పిటల్లో నీవద్ద లేరని తెలిసి, చొరవగా ఈ లేఖ వ్రాస్తున్నాను.

—నీ (వాడు కాలేని) కృష్ణ.''

ఉత్తరం మడిచాను.

నా మనసంతా వికారం పేరుకుపోయింది. సహజంగా నా గుండె ప్రతి చిన్న విషయానికి స్పందిస్తుంది. ఏ వుద్రేకం పుట్టించినా, నేను విపరీతంగా తల్లడిల్లిపోతాను. ఒక కథ చదివి వేసే చాలాసేపు ఆ కథగురించి ఆలోచిస్తూ వుండిపోతాను. అట్లాంటిది ...ఇది — ఈ వుత్తరం నాతో చాలా సంరంభాన్ని లేపింది. ''భారతిలాంటి ఆడవాళ్ళు వుంటారా? ' అని చకితుణ్ణి అయ్యాను. ''భారతీదేవి కృష్ణపట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించింది!'' అని బాధపడ్డాను. కృష్ణకి జరిగిన అన్యాయానికి విచారించాను. కృష్ణని తల్చుకుంటే జాలి, సానుభూతి వెల్లువయి పుబుకుతున్నాయి. భారతీదేవి ఎదురుగావుంటే — ''నిన్ను ప్రాణప్రదంగా ప్రేమించే కృష్ణని ఎట్లా వదులుకున్నావు? అతను అమెరికానించి వచ్చేవరకు ఆగలేకపోయావా?'' అని నిలదీసి అడుగుదామనిపించింది. ఏదీ? భారతీదేవి?

నిన్ననే వెళ్ళిపోయింది! కృష్ణ రాసిన ఉత్తరంలో తేదీ చూసాను. 16వ తేదీన వస్తున్నానని రాసాడు. అంటే ఇవాళ వస్తాడన్నమాట! కల్సుకోలేక పోయినందుకు విచారిస్తూ వెళ్ళిపోతాడు!! ప్చ్!

రెండవ వుత్తరం తీసాను.

అది భారతీదేవి భర్త రాసినది. పూర్తిగా సంసారపక్షంగా నడిచింది వ్రాత.

"భారతికి,

నేను కులాసాగా వున్నట్లు తలుస్తాను. నిన్ను హాస్పిటల్లో చేర్చి ఇక్కడకు వచ్చిన మర్నాడే తమ్ముడివద్దనుండి టెలిగ్రాం వచ్చింది. నాన్నకి సీరియస్‌గా వుందని, తక్షణం రమ్మనమని! వెంటనే అక్కడకు వెళ్లాను. ఇప్పుడు కొంచెం జ్వరం తగ్గింది. నేను అక్కడకు మూడు రోజుల్లో వస్తున్నాను. అప్పటికి నీ ఆరోగ్యం బాగవుతే, త్వరగా డిశ్చార్జి చేయించుకొని వెళ్ళిపోవచ్చు.

అమ్మ, తమ్ముళ్ళు, చెల్లాయిలు అంతా ఇక్కడ కులాసాగా ఉన్నారు.

అమ్మ నా వెంట వస్తానంటూంది. నీకు వంట్లో బాగులేదని, హాస్పిటల్లో వున్నావని తెలిసి ఆవిడ పడిన ఆందోళన ఇంతింతకాదు. నిన్ను తీసుకుని మన వూరు వెళ్ళేముందు మా వాళ్ళింటికి వెళ్ళి అక్కడ రెండురోజులు అయినా వుంచక పోతే వాళ్లు వూరుకునేట్టు లేరు. ఆ ప్రకారం చేద్దాం!

ఇంతకంటె రాయాల్సినవేం లేవు. వుంటాను.

—శ్రీధరరావు.

నివ్వెరపోయాను. భారతీదేవి భర్త ఈ ఉత్తరంలో మూడురోజుల్లో ఇక్కడికి వస్తున్నట్టు రాసేడు. వుత్తరంలో నాలుగు రోజుల క్రిందటి తేదీ వేసి వుంది. అంటే నిన్ననే శ్రీధర్‌రావు వచ్చి భార్యని తీసుకువెళ్లిపోయాడన్నమాట! ఈ ఈ ఉత్తరం ఈ రోజున ఇక్కడికి చేరింది! మైగాడ్! పోస్టల్ డిపార్ట్‌మెంటిని తల్చుకుంటే కోపం, నవ్వూ రెండూ.... వచ్చాయి!

కృష్ణ ఎంత ఆత్రంగా వస్తాడో! భారతీదేవి డిశ్చార్జి అయి భర్తతో కలిసి వెళ్లిపోయిందని తెల్సి చాలా విచారిస్తాడు. కృష్ణని తల్చుకుని మరోమారు నిట్టూర్చాను. భారతీదేవి వెళ్ళిపోయిన తర్వాత కృష్ణ రాసిన ఉత్తరం రావటం వలన అతను వస్తున్నట్లు ఆమెకు తెలియదు. ఈ వుత్తరం ముందుగా రాకపోవటాన కృష్ణ భారతీదేవి దర్శనం చేసుకునే అవకాశం తప్పిపోయింది! అతడు దురదృష్టవంతుడు.

కృష్ణవస్తున్నట్టు తెలిస్తేమట్టుకు భారతీదేవి అతను వచ్చేవరకు నిరీక్షిస్తుందా? ఉహూ, నాకు నమ్మకంలేదు. ఆడది పెళ్లయిన వరకు ఒక రకపు మనస్థత్వంతో వుంటుంది. పెళ్లి అయ్యాక మరొక రకంగా మారిపోతుంది. కన్యగా వుండే

వరకు ఏ పురుషుణ్ణయినా, ఎంత ఘాటుగా నయినా ప్రేమించవచ్చు. వివాహం అయిన మరుక్షణం తన మనసు, తనువు, కలలు, కోరికలు సర్వం భర్త సన్నిధిని అర్పిస్తుంది. భర్త సమక్షంలో దేవుడుకూడా పరిత్యజింపదగిన వాడిగానే తోస్తాడు.

నాకు మళ్ళీ ఊపిరితిత్తుల్లో కొంచెం నొప్పి ప్రారంభమయింది. ఒక చేత్తో కడుపు పట్టుకుని, మరోచేత్తో ఆ కవర్లు పట్టుకుని కూచుండిపోయాను. నిజానికి నాకూ, ఈ భాగోతానికీ ఏమీ సంబంధం లేదు! కాని, ఎంత చిన్న విషయమైనా ఉద్రేకం కలిగిస్తే అంత త్వరగా దాన్ని విడిచిపెట్టి, మరిచిపోలేను! ఈ వుత్తరాల కథమీద నా వుత్సుకత ఇంకా తగ్గలేదు, ఈ భారతీదేవిపైన నా కోపం ఇంకా తరగలేదు.

నర్సుని పిల్చి ఆ వుత్తరాలు ఇచ్చెయ్యా లనుకున్నాను! నా కెందుకు అవి? వాటితో సంబంధం వున్న ఇద్దరు వ్యక్తులు లేనే లేరు. మూడోవ్యక్తి రాబోతున్నా—అత నికీ వుత్తరం చూపించి అతనిలో విషాదాన్ని నాకళ్ళతో నేనింకా చూడలేను.

నర్సుని పిల్చి, ఉత్తరాల సంగతిచెప్పి "భారతీదేవి అనే ఆమె ఈ గదిలో వుండేవారా?" అని యథాలాపంగా ప్రశ్నించాను.

నర్సు ముఖంలో మార్పు వచ్చింది. నిట్టూర్చింది!

నేను మామూలుగా నవ్వుతూ "చూడండి.... " అని ఏదో చెబుతున్నాను.

నర్సు గబగబా "మీకు తెలియదా, ఈ విషయం? భారతీదేవి పోయారు" అంది.

నాకేం బోధపడలేదు. నోరు తెరిచి చూసాను.

"నిన్న ఈ రూమ్‌లోనే చనిపోయారు. ఆవిడ....ఓహ్! మీరు ఇవాళ కదూ, వచ్చారు. మీకు తెలీదు! ఔను!" అంది నర్సు.

"చాలా మంచావిడండీ, పాపం.... ఈ మంచం మీదనే కూచుని నాతో ఎన్ని కబుర్లు చెప్పేవారో! చాలా సరదాగా మాట్లాడేవారు కాని అంతరంగంలో ఏదో దిగులుతో వున్నట్లు మాత్రం ఆవిడ తీరుచూస్తే నాకు అనిపించేది. అరె! అదేం! మీరలా అయిపోయారేవిటి? నొప్పివస్తోందా? అన్నట్టు — ఇంజక్షన్ ఇవ్వాలి కదూ? సిరెంజి తెస్తాను. పడుకోండి. తిరగకండి. బలహీనంగా వున్నారు...." అంటూ వెళ్ళిపోయింది.

భారతీదేవి చనిపోయింది!....చని....పోయింది....

నా చెవుల్లో నర్సుమాట సముద్రం హోరులా ధ్వనిస్తూంది!

భారతీదేవి మరణించిందన్న నగ్న సత్యం నన్ను నిలువునా కంపింపజేస్తూంది. సృష్టిలో ఈ జీవితాలు ఎంత చిత్రమైనవి!




"ఎన్ని కబుర్లు చెప్పేవారండీ. ఆవిడ, ఈ గదిలో, ఈ మంచం మీదే... ' తృళ్ళి పడ్డాను. గదిలో మంచం వేపు చూసాను. తెల్లటి నాజూకైన, ఆకర్షణీయమైన విగ్ర హం పడుకుని వున్నట్టు—కన్పించింది.

ఒళ్లు జలదరించింది.

కళ్లు నులుముకుని చూసాను. మంచం మామూలుగానే వుంది. తల తిప్పాను.... ఎవరు? ఎవరక్కడ? తెల్లని వాయిలు చీరె....పిరుదులు దాటిన వాల్జడ....కిటికీ దగ్గర....వూచలు పట్టుకుని, అవతలికి చూస్తోంది?

చెమట పట్టి చొక్కా తడిపింది.

ఈ క్షణంలో—నాకు భారతీదేవి చని పోయింది అన్న విచారంకన్నా, దిగులు కన్నా, ఆమె ప్రేతాత్మ ఈ గదిని ఆవ రించుకుని వుందన్న భయమే ఎక్కువగా వుంది. అదేమిటో!!? గది నలుమూలలూ బితుకూ బితుకూ చూస్తూ తలుపులికి అంటుకు వుండిపోయాను.

"ఏమండీ...." సన్నని కంఠస్వరం! నాజూగ్గా! నా వెనగ్గా!!

త్రుళ్ళిపడి వెనక్కి తిరిగాను! నర్స్! ఇంజక్షన్ చెయ్యటానికి సిరంజి పట్టుకు నించుంది! "పిలిస్తే అలా తృళ్లిపడతా రేమండీ? గలగల నవ్వింది. మరొకప్పు డైతే నర్స్ సౌందర్యానికి, ఆ హొయ లుకి, ఆ నవ్వులోని మాధుర్యానికి కులాసా చెందేవాణ్ణేమో గాని, ఇప్పుడు కేవలం భయం ఒంట్లో స్వైరవిహారం చేస్తూ మిగతావాటికి చోటివ్వటం లేదు.

ఇంజక్షన్ చేసి వెళ్లిపోతున్న నర్స్ని పిలిచాను.

"సిస్టర్! చూడండి....మరో రూం ఏదైనా ఖాళీగా ఉందేమో, చూసి చెప్పండి" అన్నాను.

ఆమె ఏదో చెప్పబోతూంటే అడ్డు పడుతూ, "నాకీ రూం సౌకర్యంగాలేదు. దయచేసి మరో రూంలోకి మారేలా ఏర్పాటు చెయ్యండి" అన్నాను.

'ఊఁ....అలాగే....చూస్తాము" అని నర్స్ వెళ్ళిపోయింది.

"లాభం లేదు! నర్స్ నా మాటలు సీరియస్‌గా తీసుకోటం లేదు! డాక్టరుతో చెప్పి రూం మార్పించుకోవాలి!' అను కొని తలుపు గడియపెట్టి మెట్లు దిగి తిన్నగా ఆఫీస్‌రూంకి వెళ్ళేను!

"మూడువందల పన్నెండో నెంబరు రూము, భారతీదేవి అనే ఆవిడ వుంటోంది. ఆ రూము ఎక్కడ వుందో చెప్తావా?' అని అడుగుతున్నాడు అక్క డున్న బంట్రోతుని ఎవరో!

గబగబా దగ్గరకెళ్ళాను.

అతడు తెల్లగా, పొడుగ్గా, పల్చగ వున్నాడు. కళ్ళలో విజ్ఞానం, శరీరంలో ఆరోగ్యం, వేషధారణలో ఆడంబరం ప్రస్ఫుటమవుతున్నాయి. ఖరీదయినవిగా కన్పిస్తున్న కళ్లద్దాలు తీసి తెల్లని చేతి రుమాలుతో తుడిచి మళ్లీ పెట్టుకున్నాడు. ఇంతలో నాకు ఇంజక్షన్ చేసిన నర్స్ అక్కడికి వచ్చి, నన్ను చూసి "రెస్టు తీసుకొమ్మంటే ఇలా తిరుగుతున్నారా:" అంటూ మందలించింది.

"చూడండి నర్స్! భారతీదేవి అనే ఆమె 312 రూమ్‌లో ఉంది! ఆ రూముకి దారి చెప్తారా?" అంటూ అతను మళ్లీ ఆ నర్స్‌ని ప్రశ్నించాడు.

అతని ముఖం అలసటను చెబు తోంది! మాటలు ఆతృతను ప్రకటిస్తు న్నాయి. నా మెదడు చకచక పనిచేస్తోంది. ఇతను....ఇతను ఎవరు? ఇతడు శ్రీధర రావు మాత్రం కాదు! ఇదివరకే ఇక్క డికి వచ్చిన శ్రీధరరావు భారతీదేవి రూం గురించి కొత్తగా ఎందు కడుగుతాడు? అతనికి ఈ సరికే ఆమె మరణవార్త తెలిసివుండాలి! మరి ఇతను ఎవరు! ఇతను కృష్ణ! అవును కృష్ణే!

నా ఒళ్లు ఝల్లుమంది. నర్స్ అంటోంది 'భారతీదేవిగారు 312 రూమ్‌లో వుండే వారండీ! కాని—ఇప్పుడు లేరు!"


"డిశ్చార్జి అయి వెళ్ళిపోయారా?" ఆత్రంగా ఆమెను అడుగుతున్నాడు.

నర్స్ "ఎలా చెప్పను?' అన్నట్లు ముఖంపెట్టి "మీరు వారికి బంధువులా?" అంది.

కృష్ణ ఊపిరి గట్టిగా పీల్చుకుని "చెప్పండి....వెళ్ళిపోయారా ఆవిడ?" అని అడిగేడు.

"సారీ! 'హార్ట్ ఎటాక్' వచ్చి నిన్ననే మరణించారు! ఆవిడ భర్త వచ్చి నిన్న సాయంకాలం శవాన్ని తీసుకుని వెళ్లిపోయారు!" అని మాట్లాడటం ఆపి గబగబ నడిచి మేడమీదికి వెళ్లిపోయింది నర్స్!

షాక్ తిన్నవాడిలా గోడకు జారగిల పోయాడు ఆ వ్యక్తి!




"మీరు ప్రేమించిన భారతీదేవి, మీరు సర్వస్వంగా భావించిన భారతీదేవి, మిమ్మల్ని మోసంచేసి పరాక లోకానికి వెళ్ళిపోయింది కృష్ణగారు! మీరు హృదయం విప్పి వ్రాసిన మీ ఉత్తరాల్లోని పంక్తులు, హృదయాన్ని కదిలించే అక్షరాలు నా జేబులోనే ఉన్నాయి.' అని అతనితో గట్టిగ అరిచి చెప్పాలనిపించింది. దగ్గరకు తీసుకుని అనునయించా లనిపించింది! కాని అతను నాకు అపరిచితుడు! నేనెవర్నో అతనికి తెలీదు! నాకూ అతనికీ ఏ సంబంధమూ లేదు మరి ఎలా చెప్పను? నీరసంగా అడుగులేస్తూ ఆఫీసు రూంలోకి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి డాక్టరు లోపల ఇంకెవరితోనో మాట్లాడు తోంది!

నలిగిన బట్టలు, చామనచాయ. మనిషి బలంగా వున్నా, ముఖం వాడిపోయి వుంది!

"చూడండి! భారతీదేవి ఎక్కౌంటులో యింకా కొంత డబ్బు కట్టాలనుకుంటాను! ఎంతో చెప్తే 'పే' చేస్తాను" అంటున్నాడు.

ఆతని మాటలు బరువుగా వున్నాయి. మరోసారి షాక్ తిన్నట్టయ్యాను. డాక్టర్ నన్ను కూర్చోమన్నట్టు సంజ్ఞచేసి, పుస్తకం తీసి లెక్కలు కడుతోంది, నేను అతనువైపే తీక్షణంగా చూశాను! అతను శ్రీధరరావయి వుండాలి! భారతీదేవి 'ఎక్కౌంట్' క్లియర్ చేయటానికి వచ్చా

దన్న మాట! నాకు ఈ సంఘటలన్నీ చూస్తుంటే మతిపోయేటట్లుంది! తలను రెండు చేతులతో పట్టుకుని కుర్చీలో కూల బడ్డాను! డాక్టరు భారతీదేవి 'ఎక్కౌంటు'లో ఎంత డబ్బు కట్టాలో చెప్పింది. అతను ఆ డబ్బు కట్టేసి బరువుగా నడుస్తూ బయటకు వెళ్ళిపోయాడు!

''డాక్టర్! నేను ఆ రూమ్‌లో వుండ లేను. 'సెంటిమెంటల్'గా ఏదో భయం నన్ను వెంటాడుతోంది. దయచేసి మరో రూమ్ యివ్వగలరా?'' అన్నాను,

డాక్టర్ నాకేసి అదోలా చూసి చిన్నగా నవ్వింది.

'ఆల్‌రైట్. 309 ఖాళీ అయింది. మీ సామానులు అందులో పెట్టమని నర్స్‌కి చెప్తాను. మీరు వెళ్ళండి!''

''థేంక్యు డాక్టర్!'' అంటూ బయటకు వచ్చాను.

బయట వరండాలో శ్రీధరరావు, కృష్ణ మాట్లాడుకుంటున్నారు.

''........'' నన్ను అన్యాయం చేసి వెళ్ళిపోయింది కృష్ణా! అంతా బాగయిపోయిందని డాక్టర్లు అన్నారు! తీరా డిశ్చార్జి చేసేసాడు. ఈ గుండె జబ్బు యింతపని చేస్తుందనుకోలేదు, ' శ్రీధర రావు గొంతు బొంగురు పోయింది! ఏడుపును బలవంతంగా ఆరికట్టుకుంటు న్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

కృష్ణ ఏమీ మాట్లాడలేదు

''ఆ మధ్య అమెరికా వెళ్లావని విన్నాను. ఎప్పుడొచ్చావ్?'' అన్నాడు శ్రీధరరావు కన్నీళ్లొత్తుకుంటూ!

''వారం దినాలయింది'' పొడిగా అన్నాడు కృష్ణ.


''ఇలా హాస్పిటల్‌కు వచ్చావేం?'' శ్రీధరరావు అన్నాడు.

''ఏం లేదు! ఒక స్నేహితురాలు హాస్పిటల్లోవుందంటే చూడాలని వచ్చేను! కాని ఆవిడ నిన్ననే డిశ్చార్జి అయి వెళ్ళిపోయిందట!'

''మరి నే వస్తాను! ఎప్పుడయినా కనిపిస్తూవుండు!'' అంటూ శ్రీ ధరరావు వెళ్ళిపోయాడు

కృష్ణ భారంగా అడుగులేస్తూ రామకృష్ణా మిషన్ బీచ్‌వైపు కదిలిపోయాడు. వెరోవంకా వెళ్లిపోతున్న యిద్దర్నీ చూస్తూ. నేను మేడ ఎక్కి రూమ్‌లోకి వెళ్లాను. ఆ రూమ్‌లో ఒక్కక్షణమైనా ఉండటానికి మనస్కరించలేదు. అల మారులోని ఫ్లాస్క్, కాగితాలు తీస్తున్నాను. ఒక వారగవున్న బైబిల్ క్రింద ఒక పుస్తకం దొరికింది. ఆత్రంగా దాన్ని తీసి విప్పాను. అది భారతి రాసుకున్న డైరీ! అమె జ్ఞాపకాల దొంతరలోని కొన్ని ముఖ్య ఘట్టాలను ముక్కలు ముక్కలు ముక్కలుగా త్రుంచి పదిల పరచుకున్నట్లుంది. ఆత్రంగా పేజీలు తిరగేశాను.

"బ్రతుకులెంత చిత్రమైనవి! ఒక్కోళ్ళ జీవితం సాఫీగ లోటులేకుండా




సాగిపోతుంది. నాకు బ్రతుకుముళ్ళబాటే అయింది! అడుగు తీసి అడుగు వేయటమే కష్టంగావుంది! కలలు కలలుగానే మిగిలిపోతాయి కాబోలు! ఒక్క కోరికా నెరవేరదు.... '!

"....కృష్ణ విదేశాలకి వెళ్ళి ఈ వేళకి సరిగ్గా సంవత్సరమయింది! అతను తిరిగి వచ్చేంతవరకు ఈ వూహల పల్లకిని అలంకరించి నిలిపివుంచనా? అనుకున్నాను... ఆ ఆశతోనే, ఆ ధైర్యంతోనే అతనికి మాట యిచ్చాను .

"నాన్నగారు సంబంవం వెతికారు. వరుడిని పెళ్ళి చూపులికి తీసుకువస్తామని నన్ను సిద్ధంగా వుండమని చెప్పారు. కృష్ణ విషయం చెప్పాను. అతనితోకలిసి నేను అల్లుకొన్న ఆశల పందిరిని కూలదోయవద్దన్నాను. నాన్నగారు వుగ్రులయ్యారు. కృష్ణ కులం ఏమిటి? మన కులం ఏమిటని గర్జించారు. చిన్నతనంలో కలిసి తిరిగితే, ఆ చనువు, స్నేహం వేరు! వయసు పైబడి, వివాహం విషయంలో జీవితాల్ని ముడిపెట్టుకుందామనుకోవడం చాలా వెర్రి వూహ అని కొట్టిపారేసేరు, నా మాటని! ఆయనకి ఎదురు చెప్పటం నావల్ల కాకపోయింది. కృష్ణ దగ్గర్నించి వుత్తరాలు కూడా రావటం లేదు .ఏ ధైర్యంతో నాన్న నెదిరించను? ఆడదాన్ని! వంటరిగా ఎక్కడికి పారిపోను ? '

'ఆయన నన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడినట్టు హావభావాలే చెబుతున్నాయి! కాని చాలా విషయాల్లో ఆయనకీ నాకు ఆమడదూరంవుంది! ఆయన వ్యవహారికంగా వుంటాడు! తినటం, నిద్రిం

చటం, కోరికలు తీర్చుకోటం. అంతే! ఆ మనసులో ప్రేమ, ఆరాధన, అనురాగం ఇలాంటి రసాలికి చోటే లేదు!'

ఏ ఆడదయినా జీవితంలో ఒక్క పురుషుడినే ప్రేమించగలదేమో! నేను మాత్రం ఇంకా కృష్ణనే ఆరాధిస్తున్నాను. నా మనసులో కృష్ణకి తప్ప వేరొక పురుషుడికి స్థానంలేదు, వుండదు! మనసుని ఆయనపట్ల కేంద్రీకరించలేక, ఆయనకి మల్లే యంత్రంలా గడపలేక రెండు విధాలా ఈ ప్రాణం వాగ్లోపడిన గింజకి మల్లే గిజగిజ కొట్టుకుంటూంది భగవాన్! యీ జీవికి విముక్తి ఎప్పుడు?

ఈ మధ్య గుండెనొప్పి తరచూ వస్తూంది.........నా వైఖరికి ఆయనలో విసుగు, అసహనం మొదలయింది. ఫలితంగా పదేపదే కీచులాటలు! ప్రేమని వ్యక్తపరిచే శక్తిలేకపోయినా, తనని నేను ప్రేమించటంలేదని మాత్రం తెలుసుకున్నారు. అందుకే ఏమమి ఉరి గారు. అప్పుడప్పుడు చెయ్యి చేసుకునేవారు కూడా.. శారీరకంగా, మానసికంగా కూడా అలిసిపోతున్నాను.

"ఇప్పటికైనా నేను ఆయన్ని ప్రేమిస్తే ఆయనలో రాక్షసత్వం తొలగుతుంది. కాని....ఆ పని నావల్ల కాదు....యింక....ఈ సంఘర్షణని నేను భరించలేను. ఎవరికీ తెలియకుండా యీ మాత్రలు నాతో తెచ్చుకున్నాను .. ఇవి ఒక్కటే నాకు శాశ్వత విశ్రాంతి, సుఖం, శాంతి యిస్తాయి"

చదవటం పూర్తయింది. మనసు మళ్ళీ బరువెక్కింది, కళ్ళనుంచి టపటప రెండు వెచ్చని నీటిబిందువులు రాలాయి. మనసును ఎవరో పిండుతున్నట్లుంది! భారంగా అడుగులేస్తూ కిటికీవద్దకు వెళ్లాను. దూరంగా సముద్ర పొడ్డున కృష్ణ నడిచి వెళ్ళిపోతున్నాడు, శూన్యంలోకి పోతున్నవాడికి మల్లే!

ఒకవైపున 'చైతన్య మందిరం' దగ్గర నిలబడి బస్సుకోసం ఎదురు చూస్తున్నాడు ప్రభాకరావు!

వారిద్దరికీ తెలియని నిజం నాకు తెలుసు! వారిద్దరికేకాదు. యీ హాస్పిటల్ స్టాఫ్‌కి కూడా యీ నిజం తెలీదు! మనసిచ్చినవాణ్ణి మనువాడలేక, మనువాడిన వాడికి మనసివ్వలేక సంఘర్షణలో నలిగి నలిగి తనువు తానే ఆహుతి చేసుకుంది భారతీదేవి!

జేబులోంచి అగ్గిపెట్టె తీసి చేతిలోని డైరీకి నిప్పంటించాను.

